క్లుప్తంగా

పోలీసుల కవాతు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో పోలీసులు ఆదివారం కవాతు నిర్వహించారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు గోల్‌బంగ్లా నుంచి మామిడిపల్లి చౌరస్తా వరకు పోలీసులు కవాతు నిర్వహించారు.

అయ్యప్ప మాలధారణ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబిహనుమాన్ ఆలయ ఆవరణలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో పలువురు భక్తులు ఆదివారం అయ్యప్ప దీక్ష తీసుకున్నారు. గురుస్వామి నగేశ్ శర్మ సమక్షంలో మాల వేసుకుని దీక్ష ప్రారంభించారు. అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

స్థానికుల సహకారంతో అంత్యక్రియలు



రెంజల్(బోధన్): మండలంలోని నీలా గ్రామంలో యాచకురాలు మృతి చెందగా, ఎస్సై ఉదయ్‌కుమార్ స్థానికుల సహకారంతో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. బోధన్ పట్టణానికి చెందిన రావుల గంగారాంతోపాటు ఆయన కూతురు లక్ష్మి(18) భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కొంత కాలంగా కామెర్ల వ్యాధితో బాధపడుతున్న లక్ష్మి ఆదివారం మృతిచెందింది. స్థానికుల ద్వార విషయం తెలుసుకున్న ఎస్సై ఉదయ్‌కుమార్ గ్రామానికి చేరుకుని మృతురాలి తండ్రి గంగారాంను విచారించారు. అంత్యక్రియలకు డబ్బులు లేవని చెప్పడంతో స్థానికుల సహకారంతో ఎస్సైతో పాటు డ్రైవర్ శేఖర్‌గౌడ్ మృతదేహాన్ని శ్మశాన వాటిక వరకు తీసుకెళ్లి అంత్యక్రియలు పూర్తి చేశారు.

నేడు ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవరం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలతో ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహిస్తామన్నారు.

తల్లిదండ్రులు ప్రోత్సహించాలి



ఆర్మూర్: ప్రత్యేక విద్య కోసం ప్రత్యేక అవసరాలు గల పిల్లలను పాఠశాలకు పంపించే విషయంలో తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉండాలని మెదక్ డయాసిస్ బిషప్ పద్మారావు సూచించారు. పట్టణంలోని సీఎస్ఐ చెవిటి, మూగ ఆశ్రమ పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. బధిర విద్యార్థులు బిషప్‌ను ఘనంగా ఆహ్వానించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ శాంతమూర్తి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిషప్ ప్రసంగించగా, ప్రత్యేక ఉపాధ్యాయులు సైన్ లాంగ్వేజ్ ద్వారా బధిర విద్యార్థులకు వివరించారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు మనోధైర్యాన్ని కల్పించేలా ప్రోత్సహించాలని అన్నారు. అనంతరం క్రీడా పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డయాసిస్ లే సెక్రటరీ ప్రభుకిరణ్, బధిర పాఠశాల మేనేజర్ సువర్ణ కిరీటి, పాస్టర్ శ్రీనివాస్, ప్రత్యేక ఉపాధ్యాయులు రాజేశ్, దిలీప్, సుధా, శ్రీజ, రజిత, మాధవి, లక్ష్మి, నిర్మల, మణిధర్ తదితరులు పాల్గొన్నారు.

మూడు పార్టీల పాగా

- ఆర్మూర్‌లో బీజేపీ, బాల్కొండలో బీఆర్ఎస్, బోధన్‌లో కాంగ్రెస్ విజయం
- ఉత్కంఠరేపిన బాల్కొండ కౌంటింగ్
- కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

ఆర్మూర్‌లో కమలం వికసించగా, బోధన్‌లో 'చేయి' సత్తా చాటింది. బాల్కొండలో కారు హ్యాట్రిక్ సాధించింది. మూడు నియోజకవర్గాల్లో మూడు ప్రధానపార్టీలు పాగా వేశాయి. ఆర్మూర్ బీజేపీ అభ్యర్థి జిల్లా లోనే అత్యధిక మెజార్టీ సాధించి విజయాన్ని కైవసం చేసుకోగా, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి అత్యల్ప మెజార్టీతో గట్టెక్కారు. బాల్కొండ ఓట్ల లెక్కింపు ప్రారంభం నుంచి చివరి ఉత్కంఠను రేకెత్తించిది. తొలిరౌండ్‌లో అత్యల్పంగా 157 ఓట్లతో లీడ్ సాధించిన ప్రశాంత్‌రెడ్డి 12వ రౌండ్ వరకు వెనుకంజలో ఉండిపోయారు. రెండో రౌండ్ నుంచి 12వ రౌండ్‌వరకు సునీల్‌రెడ్డి లీడ్‌లో కొనసాగడంతో ఆయన విజయం ఖాయమని అంతా భావించారు. 17వ, 18వ రౌండ్‌కు వచ్చేసరికి ప్రశాంత్‌రెడ్డి ఆధిక్యతను ప్రదర్శించి విజయం సాధించారు.



రెంజల్‌లో సంబురాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

ఆర్మూర్‌లో వికసించిన కమలం

ఆర్మూర్: ఎన్నికల ఫలితాలపై కొనసాగిన ఉత్కంఠకు తెరదించుతూ ఆర్మూర్ నియోజకవర్గంలో కమలం వికసించింది. బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి అయిన కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డిపై 29,669 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. మొత్తం 16 రౌండ్లలో ఓట్ల లెక్కింపు కొనసాగగా, మొదటి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు రాకేశ్‌రెడ్డి ఆధిక్యాన్ని ప్రదర్శిస్తూ వచ్చారు. చివరి రౌండ్ పూర్తయ్యేసరికి రాకేశ్‌రెడ్డి 72,658 ఓట్లు సాధించగా, వినయ్‌రెడ్డి 42,989, బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి 39,395 ఓట్లు సాధించారు. రాకేశ్‌రెడ్డి విజయం ఖరారు కావడంతో బీజేపీ శ్రే ణులు జిల్లా కేంద్రం నుంచి ఆర్మూర్‌కు ర్యాలీ నిర్వహించారు.



పార్టీ శ్రేణులతో రాకేశ్‌రెడ్డి విజయోత్సవ సంబురాలు

ఆర్మూర్ చరిత్రలో బీజేపీకి మొదటి విజయం

ఆర్మూర్: ఆర్మూర్ నియోజకవర్గానికి 1952 నుంచి 15సార్లు సార్వత్రిక ఎన్నికలు నిర్వహించారు. అయితే ఆర్మూర్ చరిత్రలో 16వ సారి జరిగిన ఎన్నికల్లో బీజేపీ మొదటి విజయం సాధించి చరిత్ర సృష్టించింది. నియోజకవర్గంలో 2014, 2018 ఎన్నికల్లో రెండు పర్యాయాలు వ్యవసాయమే వృత్తిగా ఉన్న సామాజికవర్గమైన గురడి కాపు సామాజిక వర్గానికి చెందిన ఆశన్నగారి జీవన్‌రెడ్డి విజయం సాధించారు. తాజాగా బీజేపీ నుంచి విజయం సాధించిన పైడి రాకేశ్‌రెడ్డి సైతం అదే గురడికాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో పాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అత్యంత ఇష్టమైన అంకాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి.

ఓట్ల శాతం ఇలా..

మొత్తం పోలైన ఓట్లలో బీజేపీ 44.9శాతం, కాంగ్రెస్ 26.52, బీఆర్ఎస్ 24.34శాతం ఓట్లు సాధించాయి. నోటాకు 0.93 ఓట్లు పడ్డాయి.

10మంది అభ్యర్థుల డిపాజిట్ గల్లంతు

పోలైన మొత్తం ఓట్లలో ఆరుశాతం ఓట్లు సాధించని అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతవుతాయి. ఈ లెక్కన ఆర్మూర్‌నియోజకవర్గంలో మొత్తం 1,61,826 ఓట్లు పోల్‌కాగా, డిపాజిట్ దక్కాలంటే 9,709 ఓట్లు సాధించాల్సి ఉంది. అయితే బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులు మినహా ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులతోపాటు స్వతంత్రులను కలుపుకుని 10 మంది డిపాజిట్ గల్లంతైంది.

బోధన్‌లో కాంగ్రెస్ జయకేతనం



బోధన్: కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి బోధన్‌లో జయకేతనం ఎగురవేశారు. సమీప ప్రత్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్‌పై 3,062 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. మొత్తం 1,71,247 ఓట్లు పోల్ కాగా, సుదర్శన్‌రెడ్డి(కాంగ్రెస్) 66,963, మహ్మద్ షకీల్ ఆమేర్ (బీఆర్ఎస్) 63,901, వడ్డి మోహన్‌రెడ్డి (బీజేపీ) 33,555 ఓట్లు సాధించారు. మొత్తం 18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు చేపట్టగా, తొలిరౌండ్ నుంచి 18వ రౌండ్ వరకు హోరాహోరీ కొనసాగింది.

ఈవీఎంలో సాంకేతిక లోపం

నవీపేట మండలం ధర్మారం గ్రామంలోని పోలింగ్ కేంద్రం నంబర్ 229లో మొత్తం 446 ఓట్లు పోలయ్యాయి. ఈవీఎం సాంకేతిక లోపం వల్ల ఈసీ వెబ్‌సైట్‌లో నమోదుకాకపోవడంతో ఎన్నికల అధికారులు ఓట్లను లెక్కించకుండా పెండింగ్‌లో ఉంచారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు. దీంతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ మధ్యాహ్నం 2 గంటలకు పూర్తి కావాల్సి ఉండగా, గంటన్నరపాటు ఆలస్యమైంది.

సత్తాచాటిన బీజేపీ

ఈ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటింది. బీజేపీ అభ్యర్థి మోహన్‌రెడ్డి 33,555 ఓట్లు సాధించారు. 1994లో సీనియర్ న్యాయవాది నర్సింహారెడ్డి 30 వేలకు పైగా ఓట్లు సాధించారు. 2009, 2018 ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులు డాక్టర్ శివప్ప, అల్జాపూర్ శ్రీనివాస్ పోటీ చేయగా, వారికి 8 వేల పైచిలుకు ఓట్లు మాత్రమే వచ్చాయి.

పడిపోయిన బీఆర్ఎస్ మెజార్టీ

మోర్తాడ్(బాల్కొండ): తెలంగాణ ఆవిర్భావం తరువాత బాల్కొండ నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగా అవతరించిన బీఆర్ఎస్‌కు తొలిసారి చేదు అనుభవం ఎదురైంది. 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థికి వచ్చిన ఓట్లతో ప్రస్తుతం ఓట్లను పోలిస్తే ఆ పార్టీకి ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యాయని స్పష్టమవుతున్నది. 2014 ఎన్నికల్లో తొలిసారి పోటీ చేసిన ప్రశాంత్‌రెడ్డికి 69,145 ఓట్లు లభించగా, కాంగ్రెస్ అభ్యర్థి ఈరవత్రి అనిల్‌కు 32,897 ఓట్లు దక్కగా, బీఆర్ఎస్‌కు 36,248 ఓట్ల మెజార్టీ లభించింది. 2018 ముందస్తు ఎన్నికల్లో రెండోసారి పోటీ చేసిన ప్రశాంత్‌రెడ్డికి 73,538 ఓట్లు లభించగా, తన సమీప బీఎస్పీ అభ్యర్థి సునీల్‌రెడ్డి 41,079 ఓట్లు సాధించారు. ఈ ఎన్నికల్లో 32,459 ఓట్ల ఆధిక్యాన్ని ప్రశాంత్‌రెడ్డి సాధించారు. ప్రస్తుత సాధారణ ఎన్నికల్లో ప్రశాంత్‌రెడ్డికి 70,417 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి సునీల్‌రెడ్డికి 65,884 ఓట్లు దక్కాయి. మెజార్టీ గతంతో పోలిస్తే అతి తక్కువ 4,,533తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఓట్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే గతంలో కంటే 3,121 ఓట్లు తగ్గినట్లు స్పష్టమవుతోంది. బీఆర్ఎస్‌కు మొదటి రెండు ఎన్నికల్లో అనూహ్యంగా భారీ మెజార్టీ లభించడం మూడోసారి మాత్రం మెజార్టీ గణనీయంగా తగ్గడం చర్చనీయాంశమైంది.

పదేళ్ల పాలనకు స్వస్తి

- సుదర్శన్ రెడ్డి



నవీపేట/బోధన్‌టౌన్/ఎడపల్లి (బోధన్): పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పాలనకు స్వస్తి పలకాలని రాష్ట్ర ప్రజలు ముందగానే నిర్ణయం తీసుకున్నారని బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. బోధన్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన తరువాత నవీపేట నుంచి స్వగ్రామమైన సిరన్‌పల్లి వరకు, ఆదివారం రాత్రి బోధన్‌లో విజయోత్సవర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల దోపిడీ, అరాచకాన్ని చూసిన ప్రజలు మార్పు కోరుకుని కాంగ్రెస్‌ను గెలిపించారన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెడతానని అన్నారు. అభివృద్ధిని విస్మరించిన బీఆర్ఎస్‌కు అభివృద్ధి ఏమిటో చూపిస్తానన్నారు. నిజామాబాద్ నుంచి బోధన్‌కు వెళ్తున్న సుదర్శన్‌రెడ్డికి నెహ్రూ నగర్, జానకంపేట్, ఎమ్మెస్సీఫారం, జంలం, శాటాపూర్‌గేట్, ఎడపల్లిలో కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. నాయకులు తాహెర్, కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి, గడుగు గంగాధర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు పాషా మొయినొద్దీన్, మాజీ ఎంపీపీ గంగాశంకర్, సుధాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, రాజేంద్రకుమార్‌గౌడ్, సాయారెడ్డి, రాంచందర్, గోవర్ధన్ రెడ్డి, కిరణ్, గోపాల్, బాబు, మూస, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



ఎడపల్లిలో కాంగ్రెస్ నాయకుల విజయోత్సవ సంబురాలు

ఏడాదిలోగా ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తాం

- పైడి రాకేశ్‌రెడ్డి



ఆర్మూర్: ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తానని, కేంద్ర ప్రభుత్వ సహకా రంతో ఏడాదిలోగా ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తామని ఆర్మూర్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. తనను ఆదరించి విజయాన్ని కట్టబెట్టిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ ధర్మపురి అర్వింద్‌ల సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి బాట పట్టిస్తానని పేర్కొన్నారు. తన విజయం కోసం సైనికుల్లా పని చేసిన ప్రతి కార్యకర్త రుణం తీర్చుకుంటానని అన్నారు. రాజకీయాల్లోకి రాకముందే తన సతీమణి పైడి రేవతిరెడ్డి, కూతురు డాక్టర్ సుచరితరెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఒక్క రూపాయికే వైద్య సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఆర్మూర్ నియోజకవర్గ ప్రజల కోసం ఆర్మూర్‌లో సైతం ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక్క రూపాయికే కార్పొరేట్ వైద్యాన్ని అందించడానికి పూర్తి ఏర్పాట్లు చేస్తామన్నారు.

ప్రజా తీర్పును గౌరవిస్తాం

- ఏలేటి అన్నపూర్ణ



కమ్మర్‌పల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తానని బీజేపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణ పేర్కొన్నారు. కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లిలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. బాల్కొండ నియోజకవర్గంలో బీజేపీ గెలుపు కోసం శ్రమించిన పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం ఏరులై పారిందని, అందుకే ప్రత్యర్థి గెలిచారని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని సూచించారు. తనకు సహకరించిన రైతులు, యువకులు, మహిళలకు కృతజ్ఞతలు తెలిపారు.

మూడోసారి ప్రశాంత్‌రెడ్డి విజయం

మోర్తాడ్(బాల్కొండ): హోరాహోరీగా సాగిన బాల్కొండ పోరులో మూడోసారి ప్రశాంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికై రికార్డు సృష్టించారు. నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదటి నుంచి తీవ్ర ఉత్కంఠను రేకెత్తించింది. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి ఆధిక్యం సాధించారు. అలాగే తొలిరౌండ్‌లో బీ ఆర్ఎస్ అభ్యర్థి ప్రశాంత్‌రెడ్డి 157 ఓట్ల స్వల్ప ఆధిక్యతను ప్రదర్శించారు. ఈ రౌండ్‌లో అనూహ్యంగా బీజేపీ అభ్యర్థి అన్నపూర్ణమ్మ 2,832 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. రెండో రౌండ్ నుంచి 12వ రౌండ్ వరకు కాంగ్రెస్ అభ్యర్థి సునీల్‌రెడ్డి ఆధిక్యతను ప్రదర్శించారు. దీంతో ఆయన విజయం ఖరారు అనే సంకేతాలు వెలువడ్డాయి. అయితే, 13వ రౌండ్‌లో అనూహ్యంగా బీఆర్ఎస్ అభ్యర్థి 1,900ల ఓట్ల ఆధిక్యాన్ని సాధించి క్రమంగా ఓట్ల సంఖ్యను పెంచుకున్నాడు. ఓ దశలో 18 ఓట్లతో మరోసారి కాంగ్రెస్ అభ్యర్థి ఆధిక్యంలో నిలువడం ఉత్కంఠ రేపింది. 17వ, 18వ రౌండ్‌లకు వచ్చే సరికి ప్రశాంత్‌రెడ్డి పూర్తి స్థాయి ఆధిక్యతను ప్రదర్శించి విజయం సాధించారు. ప్రశాంత్‌రెడ్డికి 70,417 ఓట్లు లభించగా, రెండో స్థానంలో నిలిచిన సునీల్‌రెడ్డికి 65,884 ఓట్లు దక్కాయి, బీజేపీ అభ్యర్థి అన్నపూర్ణమ్మ 30,250 ఓట్లు సాధించి మూడోస్థానంలో నిలిచారు. విజయం సాధించిన ప్రశాంత్‌రెడ్డి 4,533 ఓట్ల ఆధిక్యాన్ని సాధించారు.



ధ్రువీకరణపత్రం అందుకుంటున్న ప్రశాంత్‌రెడ్డి

బీఆర్ఎస్ అభ్యర్థి ప్రశాంత్‌రెడ్డి విజయానికి భీమ్‌గల్, వేల్పూర్ మండలాల ఓట్లే కీలకంగా మారాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 2014, 2018 ఎన్నికల్లో భారీ విజయం సాధించిన ప్రశాంత్‌రెడ్డి ఈ ఎన్నికల్లో ఎదురీదాల్సి వచ్చింది. 2018 ఎన్నికల్లోనూ భీమ్‌గల్, వేల్పూర్ మండలాలే ప్రశాంత్‌రెడ్డికి భారీ ఓట్లు అందించి భారీ విజయానికి కారణం అయ్యాయి. ఇప్పుడు కూడా ఈ రెండు మండలాలు ఆదుకోవడంతోనే మంత్రి ప్రశాంత్‌రెడ్డి మూడోసారి అసెంబ్లీలో అడుగుపెట్టడానికి అవకాశం లభించిందని చెప్పొచ్చు.

బాల్కొండ నియోజకవర్గం ఓట్లు

అభ్యర్థి	పోలైన మొత్తం ఓట్లు	పోస్టల్ బ్యాలెట్
అన్నపూర్ణమ్మ(బీజేపీ)	30,250	297
పి నర్సయ్య(బీఎస్పీ)	1,228	35
ప్రశాంత్‌రెడ్డి(బీఆర్ఎస్)	70,417	554
సునీల్‌రెడ్డి(కాంగ్రెస్)	65,884	859
ఏ అశోక్‌గౌడ్(బీఎల్‌పీ)	782	05
జీ శ్రీనివాస్(ఏడీఆర్‌పీ)	3,313	14
సీహెచ్ శేఖర్(బీసీవైపీ)	868	03
భోజన్న(డీఎస్పీ)	935	16

ఆర్మూర్ నియోజకవర్గం ఓట్ల వివరాలు

అభ్యర్థి(పార్టీ)	సాధించిన మొత్తం ఓట్లు	పోస్టల్ బ్యాలెట్
పైడి రాకేశ్‌రెడ్డి (బీజేపీ)	72,658	1,003
పొద్దుటూరి వినయ్‌రెడ్డి(కాంగ్రెస్)	42,989	635
ఆశన్నగారి జీవన్‌రెడ్డి (బీఆర్ఎస్)	39,395	342
చెరుకు ప్రేమ్‌కుమార్ (డీఎస్పీ)	1,477	26
గండికోట రాజన్న (బీఎస్పీ)	1,390	41
న్యాలపతి ప్రణయ్‌గౌడ్ (స్వతంత్ర)	945	02
గంగాధర్ మ్యాక (స్వతంత్ర)	462	02
సుంకె శ్రీనివాస్ (స్వతంత్ర)	368	04
కోటగిరి శ్రీనివాస్ (స్వతంత్ర)	200	05
ఎస్‌కే మాజిద్ (మజ్లిస్ బచావో తెహ్రీక్ పార్టీ)	117	-
పల్లావుల రామకృష్ణారెడ్డి (భారత చైతన్య యుజవన పార్టీ)	114	02
తాళ్లపల్లి శేఖరయ్య (విద్యార్థుల రాజకీయ పార్టీ)	106	-
రుతె రవి (బలిరాజ పార్టీ)	106	02
నోటా	1499	06
తిరస్కరణకు గురైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు	--	155
పోలైన మొత్తం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు	--	2,225

ఆర్మూర్‌లో నోటాకు 1,499

ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలో నోటాకు ఏకంగా 1499 ఓట్లు పడ్డాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులతో కలుపుకుని బరి లో ఉన్న మొత్తం 13 మంది ఏ ఒక్కరూ తమకు నచ్చలేదని 1499 మంది నోటాకు ఓటు వేయడం చర్చీయాంశమైంది.

బోధన్ నియోజకవర్గం ఓట్ల వివరాలు


అభ్యర్థి(పార్టీ)	సాధించిన మొత్తం ఓట్లు	పోస్టల్ బ్యాలెట్ ఓట్లు
పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి (కాంగ్రెస్)	66,963	530
మహ్మద్ షకీల్ ఆమేర్ (బీఆర్ఎస్)	63,901	237
వడ్డి మోహన్‌రెడ్డి (బీజేపీ)	33,555	321
ఎం. అమర్‌నాథ్‌బాబు (బీఎస్పీ)	1425	18
హన్మాజీ భూపాల్‌రెడ్డి (అలయెన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ)	1591	01
డి.నాగరాజు (ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్)	633	01
మురళి సాయం (ధర్మసమాజ్)	171	0
మోసిన్ (ఎంసీపీఐ-యూ)	481	04
రజితవాణి (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా)	123	0
షార్జల్ ఫర్వేజ్ (ఆలిండియా మజ్లిస్ ఇ-ఇంక్విలాబ్-ఇ-మిల్లత్)	202	01
జునైద్ అహ్మద్ (ఇండిపెండెంట్)	303	05
షేక్ జలీల్ (ఇండిపెండెంట్)	520	03
సయ్యద్ అస్గర్ (ఇండిపెండెంట్)	636	02
సుదర్శన్‌రాజ్ (ఇండిపెండెంట్)	523	0
పోలైన మొత్తం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు	--	1123
పోలైన నోటా ఓట్లు	872	--

సర్వేలకు అందని ఫలితం

మోర్తాడ్(బాల్కొండ): బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని సర్వేలు పేర్కొనగా, ఫలితం మాత్రం అందుకు భిన్నంగా వచ్చింది. పోలింగ్ రెండు మూడు రోజుల ముందు చోటుచేసుకున్న పరిణామాల కారణంగా సర్వే ఫలితాలు తరుమారయ్యాయని పలువురు పేర్కొంటున్నారు. 1994 ఎన్నికల్లో టీడీపీ ప్రభంజనాన్ని తట్టుకుని కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌రెడ్డి విజయం సాధించినట్లే ఈ సాధారణ ఎన్నికల్లో అప్పటి ఫలితమే పునరావృతమైందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 1989లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన సురేశ్‌రెడ్డి రెండోసారి టీడీపీ గాలిని తట్టుకుని ఆ పార్టీ అభ్యర్థి బద్దం నర్సారెడ్డిపై 5,863 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

ప్రస్తుత సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ గాలివీచినప్పటికీ బీఆర్ఎస్ తరఫున మూడోసారి పోటీ చేసిన మంత్రి ప్రశాంత్‌రెడ్డి తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి సునీల్‌రెడ్డిపై 4,533 ఓట్ల మెజార్టీతో విజయం సాధించడం విశేషం.

బాల్కొండలో అనూహ్యంగా పుంజుకున్న బీజేపీ



మోర్తాడ్(బాల్కొండ): బాల్కొండ అసెంబ్లీ స్థానానికి గతంలో జరిగిన ఎన్నికల్లో బీజేపీకి నామమాత్రంగా ఓట్లు రాగా, ఈసారి మాత్రం ఎక్కువ ఓట్లు సాధించి ఆ పార్టీ అనూహ్యంగా పుంజుకుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ తరఫున పోటీ చేసిన ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ 30,250 ఓట్లు సాధించారు. 2019 జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా గెలిచిన ధర్మపురి అర్వింద్‌కు బాల్కొండ నియోజకవర్గంలో 67,170 ఓట్లు లభించగా, అతని సమీప బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల కవితకు 55,439 ఓట్లు దక్కాయి. అప్పట్లో ఈ నియోజకవర్గంలో బీజేపీకి 11,731 ఓట్లు ఎక్కువ లభించాయి. బీజేపీకి మొదటిసారి ఎంపీ ఎన్నికల్లోనే బాల్కొండలో ఎక్కువ ఓట్లు లభించాయి. ఆ తరువాత ఈ సాధారణ ఎన్నికల్లో ఓట్లు పెరిగాయి. గతంలో ఎప్పుడు కూడా 5వేలకు మించి ఓట్లు బీజేపీ అభ్యర్థులకు దక్కలేవు. తొలిసారి అన్నపూర్ణమ్మకు ఎక్కువ ఓట్లు లభించడం విశేషమని చెప్పొచ్చు. ఈ లెక్కలను పరిశీలిస్తే నియోజకవర్గంలో బీజేపీ గ్రాఫ్ క్రమంగా పెరుగుతున్నట్లు స్పష్టమవుతున్నది.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు

ఎడపల్లి/బోధన్‌టౌన్/రెంజల్(బోధన్): బోధన్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు విజయోత్సవ సంబురాలను ఘనంగా నిర్వహించాయి. ఆయా మండలాల్లో పటాకులు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఎడపల్లి, రెంజల్‌మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. రేవంత్‌రెడ్డి, సోనియా చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బోధన్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా, అజాంగంజ్ కాలనీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబురాలు నిర్వహించి పటాకులు కాల్చారు. బోధన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హరికాంత్ చారీ, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బడు, రెంజల్‌లో నాయకులు సాయి బాబాగౌడ్, మొబిన్‌ఖాన్, సాయారెడ్డి, రాములు, సురేందర్‌గౌడ్, జావీద్, గంగాకృష్ణ, రాములు, బాబన్న, గయాస్ పాల్గొన్నారు.



బోధన్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో..



సుదర్శన్‌రెడ్డి తరఫున ధ్రువీకరణపత్రం అందుకుంటున్న పార్టీ నాయకులు